దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
బుధవారం , 4 - 2 -2026

## సౌమ్య చేసిన ప్రాణత్యాగం వీరత్వం

## గూడూరు ఎక్సైజ్ సీ ఐ బిక్షపతి



**తొలిసమయం కొత్తగూడ**

గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలపై పోరాటంలో సౌమ్య చేసిన ప్రాణత్యాగం అత్యంత వీరత్వంతో కూడినదిఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం సంపూర్ణ అండగా నిలవాలి: గూడూరు ఎక్సైజ్ సీఐ బిక్షపతి డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల గూడూరు ఎక్సైజ్ శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తు మంగళవారం గూడూరు ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో సౌమ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గూడూరు ఎక్సైజ్ సీఐ బిక్షపతి మాట్లాడుతూ, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలపై పోరాటంలో సౌమ్య చేసిన ప్రాణత్యాగం అత్యంత వీరత్వంతో కూడినది. ఆమె విధి పట్ల చూపిన అంకితభావం ప్రతి ఎక్సైజ్ సిబ్బందికి స్ఫూర్తిదాయకం. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం సంపూర్ణ అండగా నిలవాలి" అని కోరారు. అలాగే గంజాయి స్మగ్లింగ్ నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత అప్రమత్తతతో విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని సౌమ్యకు ఘనంగా నివాళులర్పించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన

## సర్పంచ్ పార్వతి దేశ్య నాయక్





**తొలిసమయం కొత్తగూడ**

కొత్తగూడ మండలం రామన్నగూడెం తండాలో మంగళవారం సర్పంచ్ పార్వతి దేశ్య నాయక్ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు హాజరైన కూలీలను కలిసి వారి పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు సరైన కూలి అందేలా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కూలీలకు జీవనాధారంగా మారిందని, ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చాలనే ప్రయత్నాలు చేయడం సరికాదని ఆమె విమర్శించారు. మహాత్మాగాంధీ పేరు దేశ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని, ఇలాంటి తప్పుడు ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పూనుగొండ్లలో పగిడిద్దరాజు తిరుగువారం పండుగ

### ఆదివాసీల ఆరాధ్య దైవం పగిడిద్దరాజుకు ప్రత్యేక పూజలు




**తొలిసమయం కొత్తగూడ**

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పునుగొండ్లలో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దైవం పగిడిద్దరాజు తిరుగువారం పండుగ రేపు (బుధవారం) నుండి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. మేడారం మహాజాతర అనంతరం వారం రోజుల తర్వాత సంప్రదాయ రీతిలో నిర్వహించే ఈ తిరుగువారం పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. పగిడిద్దరాజు చరిత్ర ఆదివాసీల జీవన విధానంతో ముడిపడి ఉంది. అటవీ జీవనం, ప్రకృతి ఆరాధన, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా పగిడిద్దరాజును ఆదివాసీలు కొలుస్తారు. తల్లి సమ్మక్కసారలమ్మ వారసత్వంలో భాగంగా పగిడిద్దరాజును ధైర్యం, న్యాయం, రక్షణకు ప్రతీకగా భావిస్తారు. ఈ పండుగ సందర్భంగా పూజారులైన పెనక వంశీయులు పెనక బుచ్చి రాములు, పెనక సురేందర్, పెనుక పురుషోత్తం ఆల యాలను శుద్ధి చేసి, ధూపదీపాలు వెలిగించి నైవేద్యాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సంప్రదాయంగా వడ్డెరలు పూజా సామగ్రిని సిద్ధం చేయగా, శివసత్తులు ఆధ్యాత్మిక ఆరాధనలో పాల్గొని డప్పులు, నృత్యాలతో పండుగకు ప్రత్యేక కళను తీసుకొస్తారు. తిరుగువారం పండుగ రోజుల్లో గిరిజనులు, గిరిజనేతర భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పగిడిద్దరాజును దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కుటుంబ సుఖసంతోషాలు, పంటల సమృద్ధి, ఆరోగ్యం కోసం భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. బుధవారం, గురువారం, శుక్రవారం మూడు రోజుల పాటు జరగనున్న ఈ తిరుగువారం పండుగతో పునుగొండ్ల పగిడిద్దరాజు మహాజాతరకు సంబంధించిన అన్ని పూజా కార్యక్రమాలు సంపూర్ణంగా ముగియనున్నాయి.

**మూడు రోజుల కార్యక్రమాల వివరాలు**

**బుధవారం (మొదటి రోజు):**



ఉదయం ఆలయ శుద్ధి కార్యక్రమాలతో పూజలు ప్రారంభమవుతాయి. పగిడిద్దరాజుకు ప్రత్యేక అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించి తొలి రోజు పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం శివసత్తుల నృత్యాలు, డప్పుల మేళతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

**గురువారం (రెండో రోజు):**

భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పగిడిద్దరాజును దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. గిరిజన సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు, బలిహరణ (సాంప్రదాయ రీతిలో) నిర్వహించనున్నారు. వడ్డెరలు నిర్వహించే ఆచారాలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.



**శుక్రవారం (మూడో రోజు):**

చివరి రోజున మహా పూజలు, కృతజ్ఞతా ప్రార్థనలు నిర్వహించి పగిడిద్దరాజుకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు. సాయంత్రం సమ్మేళన పూజలతో తిరుగువారం పండుగ ముగింపుకు చేరుకుంటుంది. ఈ కార్యక్రమాలతో పగిడిద్దరాజు మహాజాతరకు సంబంధించిన అన్ని పూజా కార్యక్రమాలు అధికారికంగా పూర్తికానున్నాయి. ఈ మూడు రోజుల తిరుగువారం పండుగకు గిరిజనులు, గిరిజనేతరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సుఖసంతోషాలు, పంటల సమృద్ధి, ఆరోగ్యం కోసం మొక్కులు చెల్లించుకుంటున్నారు.